# ఇంటితనఖా దస్తావేజు

వాస్తుశాస్త్రం ప్రకారం నివాసయోగ్య 'గృహానికి శివదృష్టిపడగూడదు, విష్ణుపృష్టము కాగూడదట. మా పూర్వులు నిర్మించుకొన్న మొదటి యిల్లు సరీగ్గా వైష్ణవాలయానికి వెనకపక్కనే వుండేది. మా తాతగారు దాన్ని విడిచి అగస్త్యేశ్వరాలయం ప్రహరీగోడనానుకొన్న విశాలస్థలంలో కొత్తగా పన్నెండుబాతిక మండువా లోగిలి నిర్మించారు. మా పాత ఇంటిని చౌకగా కొనుక్కొన్న ఆసాములు మాత్రం సులక్షణంగా ఏడాదికో ఎకరం పొలం ఆర్జించుకొంటూనే ఉన్నారు- ఈ యింటికీ శివదృష్టి పడిందని నాన్నగారికి అనుమానం పట్టుకొన్నది. మరి, గత రెండేళ్ళ నుండీ కాంట్రాక్టు పనుల్లో అన్నీ నష్టాలు సంభవించటానికి యితరత్రా కారణాలు నాన్నగారికి కనిపించలేదు. ఇక గోదావరి తీరాల నుండి వాస్తు పండితులు విచ్చేశారు. క్షేత్రీయపదములు కొలిచారు. ధ్వజాయము,

ధూమాయము, సింహాయము— యిత్యాది పరీక్షలు నిర్వహించారు. కొన్ని కుడ్యాలు, ద్వారాలు మూయించారు. కొన్ని కొత్తగా గోడలు పగులగొట్టించి నిర్మింపజేశారు. భూరిదక్షిణలు, అన్నదానాలు ముగిసినా, నాన్నగారికి తృప్తి కలగలేదు. ఇప్పుడు మళయాళదేశ తాంత్రికపూజలు కొనసాగుతున్నవి.

మధ్యాహ్నం భోజనం వడ్డిస్తూ అమ్మ అన్నది.

"పొలం అమ్ముతారు. నీ సంతకం గూడా కావాలిట నాన్నగారు చెప్పమన్నారు."

''అమ్మటం దేనికి?"

''ఇంకో పదివేలవుతాయట యీ పూజలకు!''

అప్పటిదాకా ఇంద్రధనుస్సు రంగుల సౌందర్యం తిలకిస్తూ యూనివర్సిటీ మైదానాల్లో విహరిస్తున్నవాడిని, ఇక నా చదువు సాగేది కల్ల. నేను వచ్చి వారం రోజులైనా నాన్నగారు మాట్లాడనిది యిందుకా? ఫీజులు చెల్లించలేదు. మెస్‌లో మూడు నెలల బాకీ. హాస్టలు వార్డెను యిచ్చిన వార్నింగ్‌తో డబ్బుకోసం వచ్చినవాణ్ణి. పరిత్యాగి పరివేదనతో అగస్త్యుల గుడికి అర్ధప్రదక్షిణ చేస్తూ తూర్పు ప్రాకారంవేపు వెళ్ళాను. వత్తుగా పెరిగిన పచ్చగడ్డి. ప్రాకారంనిండా పాకిన అడవి లతల్ని పెనవేసుకొని బ్రహ్మజెముడు పొదలు. లెక్కకు మించిన మారేడు వృక్షాలు. సర్పరాజుల ఆ విహారభూమిలో పిల్లలెవరూ ఆడుకోను సాహసించరు పొనుపట్టం నీడకింద ఎప్పుడు కునుకు పట్టిందో తెలియదు. నిద్రలో చిన్న స్వప్నం. నాన్నగారి తర్వాత యీ దేవాలయానికి నేనే ధర్మకర్తృత్వం వహించాలి గదా. అప్పటి పరిస్థితి తలచుకొంటే గుండె జలదరించింది. నేను దరిద్రుణ్ణో, నిరుద్యోగినో అయి, ఈ ధర్మం ఎట్లా నిర్వహించగలను? ఎన్నడూ గుడి అంతర్భాగంలో అడుగుపెట్టనివాడికి నన్నెవరో ఆశీర్వదిస్తున్నట్లుంది. ఏదో మహాసుఖం ఉబికివస్తూన్నది. నా జుట్టు నెవరో నిమురుతున్నారు. నా

పెదిమలకు చల్లని తీయని సుఖవేదన కలుగుతున్నది. కళ్ళు తెరవ గలిగాను. సాయంసంధ్య చిరు చీకట్లలో తన కురులతో నా ముఖాన్ని కప్పి గాఢంగా నన్ను వుక్కిరిబిక్కిరి చేస్తున్న అరుంధతి. మత్తుగా వున్నట్లున్న షీకాయి అభ్యంగన స్నానంచేసిన ఆ పొడుగుజడ వాసనలు.

"అరూ...?"

ఇంతమోహావేశంలో అరుంధతిని నేనెప్పుడూ స్పృశించలేదు. ఎన్నిసార్లు ఆ రహస్య సంకేతనంలో మేము చిన్ననాటినుండీ మాట్లాడు కొన్నాము. ఎప్పుడూ యిలా జరగలేదు.

"ఏడవకు—"

"నాకు ఏడుపు చేతకాదు" అన్నాను.

"అవును. కుళ్ళిపోవటం చేతనవును. నా కన్నీ తెలుసు!" పసి పాపల అసహాయ రోదనను మరిపించే చల్లని తల్లుల జోలపాటలాగా వినిపిస్తున్నది.

"నీ చదువాపకు. వెళ్ళిపో. కాలేజీలో చేరు. నన్ను మరచిపోకు. ఉత్తరం రాయకు. వీలైతే కబురుచెయ్యి. ఏదీ నీ జేబు."

నోట్లు కుక్కుతున్నది. వెయ్యిరూపాయలు. పది పెద్దనోట్లు.

"వద్దు అరుంధతీ:.. మీ నాన్నగారికి తెలిస్తే?"

"తెలీదు. ఇది నా డబ్బు అంటే నీది..."

* * *

ప్రహరీ ఆవలనుండి 'అక్కా' అని వాళ్ళ చెల్లెలు భానుమతి కీచురవళి నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ వినిపించింది. పక్షులు గూళ్ళు చేరుతూ, పసికందులు శత్రులబారి పడలేదు గదా అని విశ్వాసంతో పరమపితకు అర్పిస్తున్న ప్రార్థనాగీతారవం గూడా వినిపిస్తున్నది.

అరుంధతి గబగబా వెళ్ళిపోయింది. గుళ్ళో శివార్చకులు సంధ్యా ర్చన చేస్తున్నారు. ప్రహరీగోడకు యీవలిదే అరుంధతివాళ్ళ యిల్లు. మొదటిసారిగా నేను గర్భగుడిముందు నిలబడి చేతులు జోడించాను.

ఎవరో భక్తుడు గంట మోగించి "శివోహం శివోహం" అని వుచ్చరిస్తున్నాడు. లోపలి జ్యోతులు నా గుండెలోనూ వెలిగినవి.

*　　　*　　　*

ఇంటిముందు ఆవరణలో మల్లెపందిరి వద్ద పట్టెమంచంమీద పడుకొని పద్మ కూనిరాగాలు తీస్తున్నది. పద్మ నాకన్నా నాలుగేళ్ళు చిన్న. రెండేళ్ళ నుంచీ అమ్మా నాన్నా సంబంధాలు విచారిస్తున్నారు. అమ్మ దిగులు, నాన్నగారి చిరాకు.

"నాన్నగారు పిలుస్తున్నార్రా అన్నయ్యా!" అని చెప్పింది.

ఇంట్లో ఆయన లేరు. కేరళ మాంత్రికులు ఆముదపు దీపాల యెదుట ముగ్గులు తీర్చి నిమ్మపండ్లమీద పసుపు, కుంకుమలు చల్లి హ్రస్వదండాలతో నేలను తాడిస్తూ మంత్రోచ్చారణ చేస్తున్నారు. భయంతో లోపలి కదుగేశాను.

"నాన్నగారు నిన్ను వెంటనే రమ్మన్నారు" అని అమ్మ చెప్పింది.

"ఎక్కడికి—?"

"ఇంకెక్కడికి? వెంకన్నపంతులు గారింటికి."

ఆ మాటల్లో అమ్మ గుండె బరువంతా వున్నది. ఇందాక గుడిలో వెలిగించుకొన్న ఆ దీపాల వెలుగూ కొడిగట్టినట్లయింది. వెంకన్న పంతులుగారింట్లో కరెంటు పోయిందేమో, ఫోనెక్సు పెట్రోమాక్సులైటు వెలుగుతున్నది.

"ఇక్కడ సంతకం పెట్టు" అని పేజీ తిప్పి చూపించారు నాన్న. అవును, నేను మేజర్ని. నా సంతకానికి విలువున్నది. ఒక్క సంతకంతో ప్రపంచయుద్ధాలు రేపారు నియంతలు. ఒక్క సంతకంతో అరవై లక్షల యూదులు భస్మమై పోయారు. ఒక్క సంతకంతోనే ఒక చక్రవర్తి సామాన్యుడై దేశాలు పట్టిపోయాడు. నా సంతకానికి విలువున్నది. బహుశ మళయాళ మాంత్రికుల దర్రిద్రమూ తీరిపోవచ్చు. నాన్నగారు వెదుకుతున్న భూమినిక్షేపాలూ బయటపడవచ్చు.

నేను సంతకం పెడుతున్నప్పుడు అరుంధతి తలుపుచాటు క్రీనీడలో నిలబడి వుండటం గమనించాను. అరుంధతి ఆయన పెద్ద కూతురు. సంపద పెరగటంతోపాటు వెంకన్న పంతులుగారి వడ్డీ వ్యాపారమూ పెరుగుతున్నది.

చీకట్లో నాన్నగారి వెనకే నేను నడుస్తూ నడుస్తూ వెనకబడి పోయాను. హఠాత్తుగా వెనకనించి నా చేతిని ఎవరో పట్టి లాగారు. భానుమతి-! అరుంధతి చెల్లెలు.

"నువ్వసలు మాట్లాట్టమే లేదు?" అన్నది కీచుగా.

"ఏం మాట్లాడను? చెప్పు!"

"కోపమా - ?"

"ఛీ! నా కెవరిమీదా కోపం లేదు. కోపం ఎందుకు?"

ఇంకా దగ్గిరగా వచ్చి భుజాలమీద చేతులు పెనవేయబోయింది. నేను తప్పుకొని - "వస్తాను, అమ్మ ఎదురు చూస్తుంటుంది!" అని రెండడుగులు వేసాను.

"ఇదిగో -"

ఆగి ఆ మసకచీకట్లోనే భానుమతి జేవురించిన ముఖం చూశాను.

"నా కేమీ తెలీదనుకోకు. ఇందాక అక్క వెయ్యి రూపాయలు నీ కిచ్చింది. నాన్నగారి యినప్పెట్టెలోవి."

ఒకే ఒక లిప్తకాలంలో ఒకే ఒక పదంగల శాపబాణంతో జంగమజీవి స్థావరమైపోవటం కాశీమజిలీ కథల్లో ఎన్నిసార్లు చదవలేదు. శరీరమంతా మహాపర్వతమంత బరువై పోయింది. మనసుమాత్రం - అవమాన భయద్వంద సంకీర్ణాల సముద్ర మధ్యస్థల ద్వీపమైపోయింది. ఒక్కటే మార్గం. ఈ సమయంలో అరుంధతి వాళ్ళమ్మతో కలిసి శివాలయంలో వుంటుంది. నిత్య దీపారాధనకు తైల సమర్పణ వాళ్ళ సంధ్యా చర్య. వెనుదిరిగి దేవాలయంవేపు ఆ బరువు కాళ్ళతోనే పరుగిడి పోయాను.

నాన్నగారు పి.డబ్లు.డి. కాంట్రాక్టు పనులు బాగా నడిపిస్తున్నప్పుడు అరుంధతిని నాకివ్వాలని కొంత ఆలోచన జరిగినట్లు నాకు తెలుసు. ఆ తర్వాత నాన్నగారి దివాలా పరిస్థితులకు తోడు అంతకు ముందే నా చదువు కుంటుబడి ఇంటర్‌లో రెండుసార్లు దండయాత్రలు చేసినప్పుడు వెంకన్న పంతులుగారింట్లో ఆ ముచ్చట సమసిపోయింది. మనం పీలుస్తున్న గాలి మనకి కనబడుతుందా? అట్లాగే అరుంధతికీ నాకూ మధ్య ఏళ్ళతోపాటు పెరుగుతున్న మమకారాన్నీ మేము గమనించలేదు. నాన్న, అమ్మ హృదయం విప్పరు. వెంకన్నపంతులు గారు అనుకొన్నది సాధిస్తారని పూరందరికీ తెలుసు. వంతెనలేని నదిని సమీపించినప్పుడు దాటే మార్గం దొరక్కపోదు అని మేమనుకొన్నాం. ఆ నది యింత సమీపంలోనే వున్నదని ఎవరు వూహించగలరు?

అరుంధతికి రహస్యంగా డబ్బు వాపసుచేసి ఆమె అంటున్న సౌమ్య వాక్యాలను వినకుండానే యింటికి తిరిగి వచ్చేసరికి, అక్క బావా వచ్చి వున్నారు. బావగారి మర్యాదలకోసం అమ్మ పద్మకు ఏవేవో పనులు పురమాయిస్తున్నది.

అక్క నాకన్నా పదిహేనేళ్ళు పెద్దది. నాకు ప్రపంచజ్ఞానం, జ్ఞాపకాలు కుదురుకోకముందే తన వివాహమై కాపురానికి వెళ్ళింది. దూరాభారాలవల్ల రాకపోకలూ తక్కువే. బావగారికి అమిత మితభాషి అని పేరు. రక్తబాంధవ్యం గూడా అపరిచిత వ్యక్తుల తాత్కాలిక పరిచయంగా మారటానికి అంతకన్నా మరేం కావాలి? పద్మ ఒక్కర్తే నా సోదరి అనే భావం ముద్రితమైపోయి, యిప్పుడు అక్కను చూస్తున్నప్పుడు, అక్క నా చదువును గురించి అడుగుతున్నప్పుడు, ఏదో అస్పష్టంగానే ఆ అనాది రక్త బాంధవ్యం స్పందించగలదు గాని వువ్వెత్తున మనోహ్లాదం కలుగుతుందా? కలగలేదు. ఆ రాత్రి వాళ్ళ సంభాషణ కర్ణపుటాలకు సోకుతున్నప్పుడు, ఆ స్పందన కూడా స్తంభించిపోయింది.

పెళ్ళినాడు అక్కకు చదివించిన స్త్రీ ధనం రెండెకరాలతో వాళ్ళ కిప్పుడు పని పడ్డది. మంచి ధరలు పలుకుతూండగానే అమ్ముకోవటం మంచిది. డబ్బుతో అవసరమూ వచ్చింది. పట్నంలో ఇల్లు కట్టు కొంటున్నారు.

"పద్మకు గూడా వివాహం చెయ్యాలనుకొంటున్నాం. మీరు కొంచెం ఆగితే మంచిది" - నాన్నగారు అర్థిస్తున్నారు.

"దానికీ దీనికీ సంబంధం ఏమిటి నాన్నా" అని అక్క.

అవును. ధనం ఎదుట తల్లి గర్భంనుండి వేదనతో, రక్త స్రావంతో, బాధా సంకేతనంతో బయటికి వచ్చిననాటి జన్మ బంధుత్వం పురాతన స్మృతి గూడా కాదుగదా! ఆ రాత్రే నేను వెళ్ళి పోవాలనే నిశ్చయానికి వచ్చాను. నిర్ధనుడిగా వెళ్ళి ఏం చేయాలి? అప్పులూ, చదువూ — విడదీయరాని కవల బిడ్డలు నాకిప్పుడు. చదువుకు ఆరాత్రే తర్పణజలం వదిలాను. రెండో బిడ్డను యిక సాకాలి.

కేరళ తంత్రవేత్తలు మరునాడు తెల్లారుగట్లే నిర్గమించారు. అక్కయ్య వాళ్ళ మాగాణి చెక్కకు గూడా బేరం కుదిరినట్లుంది. ఎవరికీ నొప్పి కలిగించకుండా, ఎవరినీ నిందించకుండా వెళ్ళటమే నా ఆశయం.

* * *

నాన్నగారి నోటినుండి అంతదైన్యపు మాటలు ఎన్నడూ విని ఎరగను.

నేను వచ్చి అబద్ధం చెప్పాను, "నా స్నేహితులు ప్రస్తుతానికి సర్దుకొంటారు - నాన్నా మీరేమీ దిగులు పడొద్దు." అటువంటి అనునయ వాక్యాలు - నాకే ఆశ్చర్యం కలిగించింది. పద్మకిదేమీ తెలియదు. అమ్మ కన్నీళ్ళు నేను చూడదలచుకోలేదు. ఇంటినుండి బయటపడ్డాను. నాన్నగారిచ్చిన కొద్ది డబ్బు జేబులో వుంది. కాని నిస్సంకోచంగా అడుగులు పడటంలేదు. ఎట్లాపడతాయ్? అరుంధతిని అంత కఠోరపు

పదజాలంతో మొన్నరాత్రే నిందించి, యిప్పుడు తేలికగా, ఏమీ జరగనట్లే పోగలనా?

"నన్ను కూడా దొంగను చేయకు. పాపిష్టిడబ్బుతో నన్ను కొనలేవు—" నా మాటలే ప్రతిధ్వనిస్తూండగా, పశ్చాత్తాపంతో, తన సర్వస్వమూ నా కర్పించడానికి సిద్ధపడ్డ అరుంధతికోసం గుడిలో వేచి చూశాను. చుట్టుదారి అయినా వాళ్ళింటివేపు సాగి తొంగిచూశాను. వెంకన్న పంతులుగారు ఇనప్పెట్టెముందు బాసీపట్టువేసి కవిలెకట్ట సర్దు కొంటున్నారు. ధైర్యం చాలక యిక రైలుబండి రోడ్డు మళ్ళాను.

* * *

ఏడుపుపాట ఎంత మధురంగా పాడినా కొంత సేపటికి ఎబ్బెట్టు గానే వుంటుందిగదా. అందువల్ల భాస్కరానికి మా యింటి గొడవలేమీ చెప్పలేదు. నాకు ఉద్యోగం...ఏదైనాసరే...కావాలని కోరాను.

"ఇక చదవ్వా?" అని ప్రశ్నించాడు.

"ఓపికలేదు, ఇచ్ఛా నశించింది."

"బాబూ! చిన్న వుద్యోగమైనా యీ రోజుల్లో అనుభవమున్నదా అని అడుగుతారు. ఆఫీసు పనైతే టైపింగు స్పీడెంత అంటారు. సేల్స్‌మన్ పని అంటావా - నీకు అబద్ధాలు రావు, ఇతర్లను మెప్పించేంతటి ఓపికమాటలు చేతగావు. కాని నీలో ఒక సిన్సియారిటీ, సీరియస్‌నెస్ వుంది. టీచర్స్ ట్రైనింగ్ కాలేజీలో ప్రయత్నిద్దాం. నీ డిగ్రీ మార్కులు అత్తెసరువైనా పరవాలేదనుకొంటాను" అన్నాడు చివరకు.

నన్ను నే నెప్పుడూ బేరీజు వేసుకోని వాణ్ణి భాస్కరం చెప్పిందీ అంచనా వేసింది సత్యదూరం కాకపోవచ్చు. ఆ రోజుల్లో యీ ప్రవేశ పరీక్షలు లేవుగనుక భాస్కరం మేనమామ ప్రిన్సిపాలే గనుక నాకు సులభంగానే సీటు దొరికింది. కొంచెం స్టయిపండుగూడా కొందరు విద్యార్థుల కిస్తారు గనక అదీ దొరికింది. నెలలు గడుస్తున్నాయి ఒక

రోజున భాస్కరం హఠాత్తుగా అడిగాడు.

"ఇంటినుంచి వుత్తరాలొస్తున్నయా!"

"నేను వ్రాస్తేగదా -" అని నానోరు జారింది.

చీవాట్లులాంటి సలహాలిచ్చాడు. "జీవితం అంటే హార్మోనీ వుండాలి. బిగడాయించుకొని కూచుంటే అది అసంపూర్ణమైన జీవితమే అవుతుంది. నిన్ను నమ్ముకొన్నవాళ్ళను నిరాశపరచటం - వాళ్ళ జీవితంలో హార్మోనీ భగ్నంచేయటం. దానికి తెలుగుపదం దొరికితే బావుణ్ణు. ఇంకా వివరించి చెప్పేవాణ్ణి."

అట్లా నా ఏడుపుపాటను భాస్కరానికి వినిపించవలసివచ్చింది క్రమక్రమంగా.

ఒకసారి అరుంధతిని గురించికూడా చెప్పాను. చాలా ఆలోచించి ఒక్కమాట అన్నాడు, అప్పటికప్పుడే గాదు- కొన్నిరోజులు పోయిం తర్వాత, ఏ ప్రస్తావన లేకుండానే.

"భానుమతితో నువు చాలా జాగ్రత్తగా వుండాలి!"

ఆ రాత్రి ఎప్పుడు కునుకుపట్టిందో తెలీదు. ఇంటిమీది కలలు ఎన్ననిగూడా లెక్కించలేదు. మర్నాడే యింటికి వుత్తరం వ్రాశాను, నేను యూనివర్సిటీలో లేనని, ఇక్కడున్నానని.

జవాబులేదు - పదిరోజులయింది.

మళ్ళీ రాసాను – జవాబు రాలేదు.

మొదట సెమిష్టర్ పరీక్షలప్పుడే ముగిసినాయి. "ఒకసారి యింటికి పోయిరా!" అని భాస్కరం సలహాయిచ్చాడు.

బాల్యంలో వినాయకుడి పూజ నేనెప్పుడూ శ్రద్ధగా ఆచరించ లేదు కాబోలు. చదువులో అంతరాయాలు తప్పటం లేదు.

* * *

'కక్షగట్టి దుముకుతున్న క్రుద్ధసర్పం ఈ జీవితం–' అని తోటి విద్యార్థి కాలేజీ ఫంక్షన్‌లో పాడిన పాటలాగానే వుంది నా అనుభవమూ,

పద్మ పెళ్ళి అయిపోయింది. కాపురానికీ వెళ్ళింది. నాన్నగారు మాత్రం ఎడమపార్శ్వపు పక్షవాతంతో అచేతనులై మంచంలో పడి వున్నారు. అమ్మ కన్నీళ్ళు గూడా యింకిపోయినవి. ఆచార్లుగారు నాన్నకు నారాయణ తైలం మర్దన చేయించటానికి వచ్చారు. ఆయన నా ముఖం చూసి ఏదో చెప్పాలని అనుకొని మళ్ళీ నిగ్రహించుకొన్నారు. చాలా సేపటికి అమ్మ అన్నది. "పద్మ వుత్తరాలు కూడా సరిగా రాయదు." ఒక్కగా నొక్క పుత్రుణ్ణి. నేను చేసిన నిర్వాకం ఏమిటి? నాన్నకు ముద్దమాటలు, నంగి మాటలు గూడా అతి కష్టంమీద బయల్వెడలుతున్నాయ్. అశ్రుజలాన్ని చదివి ఆకళింపు చేసుకోవాలి. నాకు చాలా అన్యాయం చేశారుట— నోట్లో పమిటచెంగు కుక్కుకొని అమ్మ మొఖం అటు తిప్పుకొన్నది.

సాయంత్రం మందుకోసం ఆచార్లుగారింటి కెళ్ళాను.

"బాబూ— శరీర రుగ్మతకు ఔషధ సేవ చేయించగలను గాని మనోవ్యాధికి నేనేమి చేసేది?" అన్నారాయన.

సత్యమే చెప్పారు. పద్మ పెళ్ళికి, నాన్న ఇల్లు తనఖాపెట్టి పెద్ద మొత్తమే అప్పుజేశారు ఈ యిల్లు కూడా దక్కదేమోననే దిగులుతోనే యీ రోగాన్ని కొని తెచ్చుకొన్నారు. నా సంతకం మరొకసారి కావాలి. తనఖా పత్రం అప్పుడు గాని రిజిష్టర్ కాదు. వెంకన్న పంతులుగారు నా కోసమే వేచివున్నారు - యిన్నాళ్ళూ.

తండ్రికి చేదోడు కాలేని చెట్టంత కొడుకుండి ఏం ప్రయోజనం? నా మెదడులో పురుగు తొలవటం ప్రారంభించింది. ఇంటికి రాగానే భానుమతి అమ్మతో మాట్లాడుతూ కనిపించింది. వాళ్ళనాన్న ఎంత సంపన్నుడైనా మాతో బంధుత్వం వుంది గదా.

"వీలైతే నాన్నగారు ఒకసారి రమ్మన్నారు" అని భానుమతి చెప్పింది.

"పద...."

"నాన్నగారితో ఒకమాట చెప్పిపోరా" అని అమ్మ.

నాన్నగారు భగవద్గీత చదవటానికి ప్రయత్నిస్తున్నారు. ఏ చేతిలోనూ పుస్తకంనిలవటం లేదు.

"నాన్నా—ఎందుకు దిగులుపడతారు? ఈ బాకీలన్నీ నేను తీరుస్తాను. వుద్యోగం వస్తుంది" అని అంటూండగానే ఆయన కళ్ళలో ముత్యాలు పొడగట్టినాయి. ఇంటి కప్పువంక చూపుతూ ఏదో మాట్లాడబోయారు.

"నాకు తెలుసు. ఇల్లు నిలువుకుంటాం. అధైర్య పడొద్దు"—నాన్నగారు వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. ఆలస్యంకూడదు. భానుమతి వెనక బయలుదేరాను.

అకస్మాత్తుగా ఎవరో నన్ను పిలిచినట్లు తోచింది. మునిచీకట్లో, అటూ యిటూ పరికించి చూచినా ఎవరూ కనిపించక ఆకాశంలో తారకల వేపు దృష్టి మలిపాను. మూగభాషలో వాటి మినుకుమినుకులే నన్ను హెచ్చరిస్తున్నట్లు — వద్దు వద్దు— అంటున్నట్లు, అంతరాత్మలో భాస్కరం మాటలే అవి. వాటిని లక్ష్యపెట్టక—"భానూ..." అన్నాను.

"అక్క సంగతా? తనకు నిన్నటిదాకా జ్వరం."

"అదికాదు... భానూ..."

"ఆ రోజున... అక్క యిచ్చిన డబ్బు సంగతి అబద్ధం చెప్పాననా?"

"అందులో అబద్ధం ఏముంది భానూ....?" ఎంత శాంతంగా అనవలెనో అంతకు రెట్టింపు శాంతంగా అన్నాను.

"ఆ డబ్బు నాన్నగారిది గాదు... తనదేగా!"

"అదేదో జరిగిపోయింది— మళ్ళీ ఎందుకులే."

"మరి— నా మీద కోపం లేనేలేదా?"

"కోపముంటే నీతో వస్తానా? మాట్లాడతానా?"

ఆచీకట్లోనే ఎంతో ఆశతో నా కళ్ళల్లోకి చూసిన భాను ముఖం

నాకింకా జ్ఞాపకం వుంది.

"నువ్వొక సాయం చేయగలవా భానూ...?"

కథల్లో మాదిరిగా - "ప్రామిస్ -" అని నా చెయ్యి అందుకొని తన అరచేతితో టప్‌మనిపించింది.

"నేనిప్పుడు దస్తావేజు మీద సంతకం చేస్తాను గదా. నాన్నగారికి కొంచెం కులాసా చిక్కితేగాని రిజిష్ట్రారు ఆఫీసుకు రానొల్లదు గదా. ఈ లోపల నాకా డాక్యుమెంటు ఒకసారి కావాలి... మీ నాన్నగారికి తెలీకుండా..."

రెండు మూడు నిమిషాలు నిశ్శబ్దంగా నడిచాము.

"పోనీలే- నీకు వీలుపడకపోతే వద్దులే."

భానుమతి టక్కున ఆగి, నా షర్టును తన రెండు చేతుల్తో గట్టిగా నాకు భయం వేసేట్లుగా లంకించుకొన్నది.

"నీకోసం ఏమైనా చేయగలను. ఏదైనా తేగలను... చూడు- రేపుగాదు ఎల్లుండి రాత్రి గుడి వెనక్కి రా. వస్తావా?..."

* * *

ఆ మరునాడంతా నాన్నగారి పరిస్థితి, కొంచెం స్తబ్దుగానే వుంది. ఆచార్లుగారు వుదయం సాయంత్రంగూడా వచ్చి నాడీపరీక్ష చేసి వెళ్లారు. ఏమీ తోచక పద్మకు జాబు వ్రాశాను. అమ్మయితే అక్కకు గూడా ఎందుకు రాయవు అని ప్రశ్నించింది. నాకిష్టం లేదు- "సరే, వ్రాస్తాన్లే" అని దాటవేశాను. కానీ ఆ రోజునే అక్కడి నుంచి మనీఆర్డరు వచ్చింది అమ్మ పేర. నాన్నగారిలో కొంత తేజం, కొంత ఓజం అవుపించింది- ఆ మరునాడు. జీవితమంటే ఇన్ని సంకీర్ణతలా?

సాయంత్రం- పిట్టలు గూళ్ళకు చేరుతున్న ముహూర్తంలో గుడి ఆవరణలోకి అడుగుపెట్టి మూడు ప్రదక్షిణలు చేశాను.

"ఇదుగో." అన్న మృదుమధుర స్వరం విని నా 'రెవరీ' నుంచి మేల్కొన్నాను. అది భానుమతి గొంతు కాదు.

ఎదురుగా అరుంధతి నిలిచివున్నది. వణికే చేతివేళ్ళతో దస్తావేజు అందుకున్నాను. మొన్న ఏ సంకోచమూ లేకుండానే భానుమతికి యీ రహస్య కార్యం అప్పగించగలిగాను. ఇప్పుడు కార్య సాఫల్యత పొంది దొంగగా, అవమాన సర్పద్రష్టుడివలె, అలనాడు సీతాదేవి, భూమాతను తనలో ఐక్యం చేసుకొమ్మని అర్థించినట్లుగానే దిక్పాలకుల్ని ప్రార్థిస్తూ నేనూ ఆచేతనంగా నిలబడిపోయాను. తేరుకొని "జ్వరమా?" అన్నాను.

"ఆలోచించే చేస్తున్నావా?" అని నా ప్రశ్నను తోసివేస్తూ అడిగింది- "భానునే ఎందుకడిగావు?"

"నాన్నగారి ధైర్యం కోసం అరూ- నీకంతా తెలుసుగదా... మళ్ళీ తెస్తాను- ఒక్కసారి చూపించి...ఇందులో చెల్లు రాయిస్తున్నానని చెప్పి... నువ్విక్కడే వుండు...మళ్ళీ ఒక్క పావుగంటలో."

అరుంధతి ఏమీ అనలేదు. తనెక్కడో ఆలోచిస్తున్నదని గ్రాహ్యమవుతూనే వుంది. ఆమె నిశ్శబ్దంలోనే ఎన్నో శంకా కెరటాలు, అమె వునికిలోనే ఎన్నో అనిర్వచనీయమైన దైన్య తరంగాలు పరుచుకొంటున్నట్లు తోచి ఆ దృశ్యం నుండి పారిపోదామని- "ఇప్పుడే వస్తాను... గుళ్ళోనే వుండు... భయం లేదు- భయం లేదు" అంటూ మా యింటి వేపు వడివడిగా నడిచాను.

నాన్నగారి మంచం ముందు కుర్చీలో వెంకన్న పంతులుగారు చేతి కర్ర పూతగా కూర్చొని వున్నారు.

"తెచ్చావా... ఏదీ ఇటుతే." అన్నాడాయన

మారుమాటాడకుండానే అయనకా దస్తావేజా యిచ్చేశాను.

"చూశావా ఇప్పటికైనా నమ్మావా?" అని నాన్నవంక నిశితంగా చూసి ఆయన వెళ్ళిపోయాడు.

నాన్నగారి ముఖం నేను చూడలేకపోయాను.

ఆ రాత్రే నా ప్రయాణం. భాస్కరానికి రైలు స్టేషన్‌లో టెలిగ్రాం యిచ్చాను. మళ్ళీ కాలేజీలో చేరాను గూడా.

పరిసరాల్నించి పారిపోవటమే పిరికివారు చేయగలిగిన ఘన కార్యం. దీన్ని ఏడేళ్ళ క్రితమే నిర్వర్తించాను నేను. ఇచ్ఛికంగా వాలంటరీ చేసి మన్యంలోకి బదిలీ చేయించుకొన్నది గూడా అప్పుడే. మాస్టరుగిరీ చేశాను. హెడ్మాస్టరుగిరీ నిర్వాకం చేశాను. పరీక్షలకు మళ్ళీ మళ్ళీ వెళ్లాను. స్కూళ్ళ యినస్పెక్టరీకి అధిరోహించాను. ఇప్పుడు సర్వీసు కమీషన్ వారు నన్ను జిల్లా విద్యాశాఖాధికారిగా ఎంపిక చేశారు. పాశ్చాత్యులు కాల గమనాన్ని వంతెన కింద నీరు ప్రవహించటం అని అలంకారికంగా అంటారు గదా. ఒకనాడు వంతెన లేని నదిని ఎట్లాగో దాటదామని కలలుగన్నాను. దాటలేక ప్రవాహంలోపడి వూపిరితోనే కొట్టుకుపోతున్నాను. మన్యం నుండి నాగరిక ప్రపంచంతో, భాస్కరం ద్వారా సంబంధాల రూపంలో పెట్టుకొని, నిర్వేదంతో అవీ తెంపుకొన్నాను. ఇది మాత్రం ఇచ్ఛికంగా చేసిన పని కాదు.

మన్యం అంటే మీరు ఆదివాసులు నివసించే చిత్తడి అడవులు, కొండలు, లోయలూ అని మాత్రమే అనుకొంటారు. ఇంకా కొంచెం ఎక్కువ రాజకీయ పరిజ్ఞానం వున్నవారు- యిది తప్పులు చేసిన అధికార్లనూ, పలుకుబడిలేని బడుగు వుద్యోగుల్ని బదిలీచేసే పనిష్మెంటు స్టేషన్ల సముదాయమనుకొంటారు. అంతకంటే పెద్ద విశేషం ఒకటున్నది: అది మన్యపు జ్వరం. మనిషి కండల్నీ, నరాల్నీ చివరకు మెదడునే రక్తహీనం చేసి పీల్చి పిప్పిని మాత్రమే జాలితలిచి వదిలే మాయదారి రోగం.

ఈ జ్వరానికి యింకో విలక్షణతత్వం వున్నది. జ్వరపీడితుల్లో జాగ్రదవస్థకూ సుషుప్తికీ మధ్య గల సంధ్యాకాలం బహు స్వల్పమైనది. ఒక్కో క్షణం రోగి మనోకాశమంతా శూన్యమైపోయి, వర్తమాన విషయాలు గాని, భూతకాల విశేషాలుగాని- ఏవీ స్మృతిలో వుండవు. మరో క్షణంలో ఆ మాగన్ను నిద్రలోనే రోగి గతజీవితమంతా అంకంకాలుగా మనోనాటకరంగం మీద దృశ్యచిత్రాల్ని ప్రదర్శిస్తుంటుంది.

నేనిప్పుడు తిలకిస్తున్నది ఆ ప్రదర్శనే.

నాన్నగారికి తలకొరివి కూడా పెట్టనోచుకోని పాపిష్టివాణ్ణి, దురదృష్టవంతుణ్ణి. ఇప్పుడు పశ్చాత్తాపపడి ఏం ప్రయోజనం? తనఖా దస్తావేజు చేజిక్కించుకొని వెంకన్నపంతులుగారు నేరుగా గృహోన్ముఖుడైనది, దాన్ని ఇనప్పెట్టెలో భద్రపరచటానికిగాదు, అరుంధతిని హింసించటానికి. అరుంధతి తప్పంతా తన మీదే వేసుకొన్నది. తనే నా మీది ప్రేమతో జాలితో తెచ్చియిచ్చానని నెపం వేసుకొన్నది. భానుమతి మాటలన్నీ అభూతకల్పనలని చెప్పింది. తిట్లు తిన్నది. చెప్పు దెబ్బలు పడ్డది. ఆ రాత్రే అవమానం భరించలేక దొడ్లో బావిలో దూకింది. కాలువిరిగిందిగాని ప్రాణాలతో బయటకి తీశారు. భానుమతికి పెళ్ళిచేసి అల్లుణ్ణి ఇల్లరికం తెచ్చుకొన్నాడు పంతులుగారు. అక్క, బావా వచ్చి ఇంటి మీది అప్పు తీర్చి అమ్మను తమతో తీసుకెళ్ళిపోయారు. కొన్నాళ్ళకు తెలిసింది- అరుంధతిని మేనమామగారింటికి పంపించి వేశారని, మేనమామగారు మన్యంలో తాసీల్దారు. ఆమె కోసమే నేను మన్యం వచ్చింది. నేను వచ్చి మన్యంలో జిల్లాలు ప్రదక్షిణ చేస్తూ ఆమెను కలవాలనే ప్రయత్నంలో వుండగానే ఆయన పదవీ విరమణ చేశాడు. అరుంధతి వాళ్ళింట్లో గూడా లేదని భాస్కరం చివరి వుత్తరం.

దృశ్యం ఆగిపోతున్నది. మన్యంలో నాకు ఆప్తుడిగా మారిన కొండదొర ఆదినారాయణ నోట్లో పసరు పోస్తున్నాడు. వాంతి అవుతున్నది.

బావగారు- ఎదురుగా కూర్చొని నా తల నిమురుతున్నారు. ఇదివరకే మీరు గ్రహించి వుంటారు. ఆ రోజుల్లో యిన్ని బస్సులు, రైలుబండ్లు ఎక్కడివి? మన్యం ప్రయాణం అంటే విదేశ ప్రయాణం కిందే లెక్క.

అక్కనూ, బావనూ నేనెంత అపార్థం చేసుకొన్నాను? మంత్రాలకు తంత్రాలకు నాన్నగారు యిల్లు గుల్ల చేస్తున్నారని ఆ భూమిని

అమ్మించారుగాని వాళ్ళకు ఆస్తులు అంతస్తులూ తక్కువై పోయా! నా ప్రాణం అనుకొన్న పద్మ యిప్పుడెంత వుదాసీనంగా వుంటున్నది? మొక్కుబడిగా మొన్ననే వచ్చి అమ్మను పిలుచుకు వెళ్ళిందట. ఆడబ్బు తోనే గదా - అక్క వెంకన్న పంతులుగారి అప్పు కొట్టివేయించింది? ఇల్లు - నిలిపింది గాని అరుంధతి త్యాగానికి ఏ ప్రతిఫలం యివ్వగలదు? భానుమతి! నీ అంధప్రేమలో ఆంతా రాక్షసత్వమేనా?

* * *

బావగారి తీవ్ర ప్రయత్నాల మధ్య నా బదిలీ ఖాయమయింది. కానీ నా మన్యపు జ్వరమూ తిరగబెట్టింది—ఛార్జీ తీసుకొన్న వారం రోజుల్లోనే, అక్క బలవంతంమీద సెలవు తీసుకొని నెలరోజుల విశ్రాంతి కోసం వాళ్ళ వూరు వెళ్ళాను. పద్మ కప్పుడు అమ్మ సాయం కావాలిట, తన కాన్పుయీ నెలరోజుల్లోనే. అమ్మకోసం మనసు పరితపించుతూండగా మగతనిద్రలో పడిపోయాను.

దినం విడిచి దినం వచ్చే జ్వరం యిది.

"మందులు తీసుకోకపోతే ఎలారా తమ్ముడూ?"

"ఈ మందులికి లొంగే జాడ్యం కాదక్కా యిది." అని నేను సమాధానం చెప్పుకుపోతున్నాను.

సహనం, నిరోధకశక్తి - శరీరం నుండీ, మనోక్షేత్రం నుండి తొలిగి పోతున్నట్లు, మొదటిసారి ఆ మధ్యాహ్నమే నాకు తోచింది. తెర జారిపోనున్నది. ఈ యాత్రకు చివరి మజిలీ చేరుకొంటున్నాను. అదిగో, అగస్త్యదేవాలయం, నేను నిద్రించే పానుపట్టంనీడ, అ ముందే పురాతన వృక్ష రాజాలు. అమ్మా, నాన్నా, అక్క - అందరూ, అరుంధతీ, చివరకు వెంకన్న పంతులూ, భానుమతీ—ఎవరెవరికి నా అజ్ఞాన చర్యల వల్ల అపచారం కలిగిందో, దుఃఖం, విచారం సంభవించినవో వాళ్ళందర్నీ క్షమించమని చివరిసారిగా ప్రార్థిస్తున్నాను. భాస్కరానికి ఆదినారాయణ

దొరకు, అతని భార్య గౌరమ్మకు నమస్కృతులు చెప్పకొన్నాను. ప్రభూ, అమ్మ రాకముందే, మళ్ళీ భవబంధాలు తిరిగి వేళ్ళూనక ముందే, నన్ను శాశ్వత నిద్రాజగత్తుకు పంపు - అని వేడుకొంటున్నాను. ఓం ఓం అని వుచ్చరించాలని తాపత్రయ పడుతున్నాను. పెదిమలు మూసుకుంటున్నాయ్.

అక్కయ్య చల్లని హస్తం నుదుటిమీద.

"జ్వరం తగ్గింది - కళ్ళు తెరు" అంటున్నది.

తెరిపిడి పడటంలేదుగాని మాటలు సుస్పష్టంగా వినిపిస్తూనే వున్నవి. నా ప్రయాణం ఆగిపోతున్నదా?

"తమ్ముడూ...మనింట్లో రఘుకు జయకు ట్యూషన్ చెప్పటానికి వస్తుందే, ఆ టీచర్ మన్యం జ్వరానికి మందిస్తుందటరా. ఇవ్వాళ రమ్మని చెప్పాను."

"వద్దు...ఇక మందులు పనిచెయ్యవక్కా."

"కాదు కాదు అనకు. అశుభం మాటలు. ఆ అమ్మాయిగూడా మన్యంలో వుండి నేర్చుకొన్నదట. ఆకులు వేర్లతో యిస్తుందట."

సుషుప్త్యావస్థ వచ్చినట్లుంది మళ్ళీ. కళ్ళు మూసుకొన్నాను.

ఎవరో నా ఉచ్ఛ్వాసనిశ్వాసాలను బంధిస్తున్నట్లనిపించి జాగ్రద వస్థలో పడ్డాను. ముక్కుపుటాలు మూస్తున్నారు. నోరు బలవంతంగా తెరుస్తున్నారు. కొండదొర ఆదినారాయణరెడ్డి యిట్లాగే మందుపోసేవాడు. కానీ షీకాకాయఘాటు సువాసన గప్పున కొట్టి, పసరు మింగలేక భళ్ళున వాంతి వచ్చింది. కళ్ళు బయర్లు కమ్ముతున్నవి. సన్నని మూగవెన్నెల తెర కన్పిస్తున్నది. తెర అవల అరుంధతి!

జీవనాడులు వేగంగా కొట్టుకొంటున్నవి. ప్రాచీన చైతన్య స్రవంతి రక్తనాళాల్లో మృదులంగా ప్రవహిస్తున్నది.

"అరూ..." అన్నాను.

అక్క నివ్వెరపోయి చూస్తున్నప్పుడే అరుంధతి నా వాంతి మలినాన్ని పమిటచెంగుతో తుడుస్తూ తన అశ్రుజలంతో క్షాళన చేస్తున్నది. అవును, నా ప్రయాణం నిజంగానే స్తంభించిపోయింది. కనుచూపు మేరలో యింకో దిశలో మరో మజిలీ వున్నది గాబోలు. ఆ దిక్కునే వున్న ప్రకాశ కిరణాలను చూడలేక మళ్ళీ నా కళ్ళు మూతలు పడుతున్నాయ్. అరుంధతీ...అరుంధతీ. నక్షత్రకన్యా.

యువ, ఆగస్టు 1987